సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం, 20, మే, 2024



జనసేన నాయకుడి దౌర్జన్యం

కేపీపాలెం బీచ్ సమీపంలో ఆటోలో వెళుతున్న ఓ కుటుంబంపై జనసేన నేత బళ్ల బాజి దాడికి పాల్పడ్డాడు. ఓ మహిళ, ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. 8లో



అతిరాత్ర మహాయాగం

భీమవరం డీఎన్నార్‌లో జరుగుతున్న అతిరాత్ర మహాయాగాలు ఆదివారం ఐదో రోజుకు చేరుకున్నాయి. 108 మంది రుత్వికులచే కోటి గాయత్రీ జపాలు నిర్వహించారు. 8లో



కళ తప్పిన కొల్లేరు

కొల్లేరు కళ తప్పింది. నీరు లేక ఎడారిని తలపిస్తోంది. విడిది కోసం వలస వచ్చే అతిథి పక్షులు నీటి కోసం, ఆహారం కోసం అల్లాడుతున్నాయి. 8లో

ఓటుకు దూరం

- జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకోని 17.4 శాతం ఓటర్లు
- గతంతో పోలిస్తే 1.58 శాతం తగ్గుదల
- అత్యధికంగా భీమవరంలో 20.65 శాతం ఓటుకు దూరం



సాక్షి, భీమవరం: ప్రజాస్వామ్య వ్యవస్థలో అతి ముఖ్యమైన ఓటుహక్కు వినియోగంలో కొందరు ఆసక్తి చూపడం లేదు. కారణమేదైనా సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో 17.4 శాతం మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోలేదు. అత్యధికంగా భీమవరంలో 20.65 శాతం మంది, అత్యల్పంగా ఉండిలో 13.8 శాతం మంది ఓటు హక్కుకు దూరమయ్యారు. తమను పాలించే పాలకులను ఎన్నుకునే స్వేచ్ఛను పౌరులకే కల్పిస్తూ భారత రాజ్యాంగం ఇచ్చిన గొప్ప ఆయుధం ఓటు. పేరుకు రెండు అక్షరాలే అయినా ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటే ఆయువుపట్టు. 18 ఏళ్ల నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడంతో పాటు ప్రతీ ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకునేలా చైతన్యవంతం చేస్తూ ఏటా ఎన్నికల సంఘం అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం గత ఏడాది చేపట్టిన స్పెషల్ సమ్మరి రివిజన్ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలుమార్లు గడువు పొడిగిస్తూ వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 35 వేలకు పైచిలుకు కొత్త ఓటర్లను నమోదు చేయించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఓటుకు దూరంగా 2,56,256 మంది ఓటర్లు

జిల్లాలో 14,72,923 మంది ఓటర్లకుగాను సార్వత్రిక ఎన్నికల్లో 12,16,667 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 2,56,256 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. భీమవరం నియోజకవర్గంలో 52,259 మంది ఓటు వేయలేదు. ఆచంటలో 30,969, పాలకొల్లులో 34,568, నరసాపురంలో 26,623, ఉండిలో 31,003, తణుకులో 41,839, తాడేపల్లిగూడెంలో 38,995 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోలేదు. ఆక్వా, పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చెందిన పశ్చిమగోదావరి జిల్లాలో ఉద్యోగం, ఉపాధి నిమిత్తం వేలాది కుటుంబాలు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి ఇక్కడ నివసిస్తున్నారు. ఎన్నికల సమయంలో వారు స్వస్థలాలకు వెళ్లి ఉండవచ్చని, కొందరు కావాలనే దూరంగా ఉండవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఓటరు జాబితాలో పేరు లేకపోతే నానా హంగామా చేయడంలో చూపించిన శ్రద్ధ ఓటు వచ్చాక వేయడంలో ఉండటం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గతంలో పోలిస్తే 1,58 శాతం పెరిగిన పోలింగ్

2019 ఎన్నికల్లో జిల్లాలో 14,39,538 మంది ఓటర్లకు గాను 11,55,300 మంది ఓటు వేయగా 2,84,238 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. గతంతో పోలిస్తే ఈ ఎన్నికల్లో ఓటు వేయని వారి సంఖ్య తగ్గడం కొంత ఊరటనిచ్చే అంశం. మునుపెన్నడూ లేని విధంగా ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ప్రస్తుత ఎన్నికల్లో చాలాచోట్ల పోలింగ్ జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు బారులు తీరి రాత్రి 11 గంటల సమయంలోను ఎంతో ఓపిగ్గా పలువురు ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. గతంతో కన్నా 1.58 శాతం మేర పోలింగ్ పెరగడానికి ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలే కారణమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

2019 ఎన్నికల్లో జిల్లాలో పోలింగ్ సరళి

నియోజకవర్గం	ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
ఆచంట	1,74,307	1,37,294	79.6
పాలకొల్లు	1,90,181	1,55,251	82.3
నరసాపురం	1,68,186	1,35,413	81.2
భీమవరం	2,46,320	1,90,569	78
ఉండి	2,19,561	1,84,192	84.80
తణుకు	2,32,212	1,86,609	81.2
తాడేపల్లిగూడెం	2,08,771	1,65,972	80.4

2024 ఎన్నికల్లో జిల్లాలో పోలింగ్ సరళి

నియోజకవర్గం	ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
ఆచంట	1,80,017	1,49,048	82.8
పాలకొల్లు	1,95,057	1,60,489	82.28
నరసాపురం	1,70,448	1,43,825	84.38
భీమవరం	2,53,116	2,00,857	79.35
ఉండి	2,24,725	1,93,722	86.2
తణుకు	2,34,575	1,92,736	82.16
తాడేపల్లిగూడెం	2,14,985	1,75,990	81.86

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఏపీఈఏపీ టెస్ట్



ఏపీఈఏపీ టెస్ట్‌కు హాజరవుతున్న వారి హాల్ టికెట్లు పరిశీలిస్తున్న దృశ్యం

భీమవరం : భీమవరంలో నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో 150 మందికి 146 హాజరు కాగా, ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో 175 మందికి 168 హాజరయ్యారు. విష్ణు కళాశాలలో 100 మందికి 97 మంది హాజరయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని పరీక్షల పర్యవేక్షకుడు ఎం.అంజన్‌కుమార్, ఎస్.జి.కె.మూర్తి తెలిపారు.

ఈఏపీ సెట్ పరీక్షకు 467 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీ ఈఏపీ సెట్ -24 పరీక్షల్లో భాగంగా ఆదివారం నగరంలోని వివిధ పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షకు మొత్తం 467 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ జరిగిన పరీక్షకు సిద్ధార్థ క్వెస్ట్ కాలేజ్‌లో 180 మందికి 177 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 141 మందికి 135 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 160 మందికి 155 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 481 మందికి 467 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారు.

పెద్దింట్లమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



కైకలూరు : కొల్లేటి కోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద ఆదివారం భక్తులు కిటకిటలాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మను దర్శించుకున్నారు. నైవేద్యాలను మొక్కులుగా తీర్చుకున్నారు. దేవస్థానం వద్ద కుటుంబ సమేతంగా వంటలు వండుకుని భోజనాలు చేశారు. ఆలయ ఈవో కెవి.గోపాలరావు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

ముత్యాలమ్మను దర్శించుకున్న భక్తులు



ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు : ముత్యాలపల్లిలో వేంచేసియున్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఎన్నికలు ముగియడంతో తమ పార్టీ అభ్యర్థి విజయం సాధించాలంటూ దర్శనానికి నాయకులు తరలి వచ్చారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

కేంద్ర బలగాలతో కవాతు



కొవ్వలిలో కేంద్ర బలగాలతో కవాతు చేస్తున్న దృశ్యం

దెందులూరు: మండలంలో వచ్చే నెల 4 వరకు 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని దెందులూరు ఎస్ఐ కే.స్వామి కోరారు. ఆదివారం మండలంలో సోమవరప్పాడు, కొవ్వలి, దెందులూరు, శ్రీరామవరం గ్రామాల్లో ఇటీవల జరిగిన హింసాత్మక సంఘటనల దృష్ట్యా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పోలీసు కవాతు నిర్వహించి పికెటింగ్ ఏర్పాటు చేశారు. మండలంలో ఏ ప్రాంతం, ఏ గ్రామంలోనైనా ఇద్దరు, ముగ్గురు కంటే ఎక్కువ మంది ఉండరాదని, రోడ్ల మీద గుంపులుగా ఉండకూడదన్నారు. రౌడీషీటర్లు, నేర చరిత్ర ఉన్న వారు పాతనేరస్తులపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. హింసకు ప్రేరేపించినా, సహకరించినా కఠిన చర్యలు ఉంటాయన్నారు.

వైభవం.. ధ్వజారోహణం

చరాచర సృష్టికి ఆహ్వానం పలుకుతూ వేడుక



కాళీయ మర్దనం అలంకారంలో శ్రీవారు

ద్వారకాతిరుమల: సహస్ర నామాలతో భక్తజన నీరాజనాలు అందుకునే శ్రీవారి బ్రహ్మోత్సవ వేడుకలకు చరాచర సృష్టిని ఆహ్వానిస్తూ.. ఆదివారం రాత్రి నిర్వహించిన ధ్వజారోహణ వేడుక భక్తజనకోటికి కనుల పండువైంది. వైఖానస ఆగమ యుక్తంగా ఇంద్రాది అష్టదిక్పాలకులు, భేరీ దేవతలను, గంధర్వ, కిన్నెర, కింపురుషాది దేవగణాలను, సప్త అధోలోక జీవులను స్వాగతిస్తూ లాంఛనంగా వేద మంత్రోచ్ఛరణలతో శ్రీవారి ఆలయ ప్రాకారంలోని ధ్వజస్తంభంపై గరుడపటాన్ని అర్చకులు ఎగురవేశారు. ఆద్యంతం ఈ వేడుక భక్తులను పరవశింపజేసింది. ఉదయం ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవ నిత్యహోమ గ్రామ బలిహరణలు, వేద స్వస్తి జరిగింది. అనంతరం సాయంత్రం రుత్విగ్వరణ, మృద్గ్రహణ, అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. రాత్రి జరగాల్సిన హంస వాహన సేవ వర్షం కారణంగా రద్దయ్యింది.

అంకురార్పణ జరిగిందిలా..

సాయంత్రం ఆలయంలో విష్వక్సేనుని ఒక వాహనంపై ఉంచి ప్రత్యేక అలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో అర్చకులు పుట్టమన్నును తెచ్చారు. ఆలయ ఆవరణలో అంతక ముందు ఏర్పాటు చేసిన పాలికల్లో ఈ పుట్ట మన్నును ఉంచి వేద మంత్రోచ్ఛరణలతో నవధాన్యాలను పోసి అంకురార్పణ జరిపారు. శాస్త్రోక్తంగా జరిగిన ఈ కార్యక్రమం అనంతరం ధ్వజారోహణను అర్చకులు వైభవంగా జరిపి శ్రీవారి బ్రహ్మోత్సవాలను వీక్షించేందుకు సర్వదేవతలను ఆహ్వానించే దిశగా గరుడపటాన్ని ధ్వజస్తంభంపై ఎగురవేసి ధ్వజారోహణను నిర్వహించారు. అర్చకులు పంపిణీ చేసిన గరుడ ప్రసాదాన్ని మహిళలు అందుకున్నారు. ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తే సంతానం లేనివారికి పిల్లలు పుడతారన్నది నమ్మకం.

కాళీయ మర్దనుడిగా శ్రీవారు

ఆలయ ముఖ మండపంలో శ్రీవారు కాళీయ మర్దనం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాళింది మడుగులో కాళీయుడు అనే సర్ప మదాన్ని అణచే విధంగా ఉన్న ఈ అలంకారం భక్తులకు కనువిందు చేసింది.



అంకురార్పణ చేస్తున్న అర్చకులు



ధ్వజారోహణను నిర్వహిస్తున్న అర్చకులు

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటల నుంచి – సూర్యప్రభ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ
- ఉదయం 7 నుంచి – భజన కార్యక్రమాలు
- ఉదయం 8 గంటల నుంచి – బుర్రకథ
- ఉదయం 9 గంటల నుంచి – భక్తిరంజని
- ఉదయం 11 నుంచి – కూచిపూడి భరతనాట్యం
- సాయంత్రం 4 నుంచి – నాదస్వర కచేరి
- సాయంత్రం 5 గంటల నుంచి – కూచిపూడి భరతనాట్యం
- రాత్రి 7 గంటల నుంచి – చంద్రప్రభ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ
- రాత్రి 8 గంటల నుంచి – నాటకం
- శ్రీవారి ప్రత్యేక అలంకారం : యోగ శ్రీనివాసుడు

అలరించిన నృత్య పోటీలు





జాతీయ స్థాయి నృత్య పోటీల్లో ప్రదర్శనలు

తాడేపల్లిగూడెం (టీటీసీ) : తాడేపల్లిగూడెం సుబ్బారావుపేట బీవీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జాతీయ స్థాయి నృత్య పోటీలు నిర్వహించారు. భరత నాట్యం, కూచిపూడి, కథక్, జానపదం తదితర నృత్యాలను ప్రదర్శించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో పోటీలు జరిగాయి. హైదరాబాద్, విశాఖపట్నం, తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులు హాజరయ్యారు. గండికోట రాజేష్, నందూరి రాధికలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. రాత్రి 7 గంటలకు పీవీకే కుందనిక (హైదరాబాద్) కథక్ నృత్య ప్రదర్శన, యం.భవితశ్రీ కూచిపూడి నృత్యం, సరగడ చిన్నారెడ్డి రైతు నృత్య ప్రదర్శనలు జరిగాయి. సభలో బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు విజేతలకు బహుమతులు అందజేశారు. కలవకులను కృష్ణంరాజు, డాక్టర్ రాజశేఖర్, చిట్యాల సురేంద్ర, పరశురామయ్య, గ్రంధి సత్యనారాయణ, కోన శ్రీనివాసరావు, కర్రి ప్రభాకర్ బాలాజీ, ఎన్వీ రమణారావు, పీటీ వెంకన్న, పైలు శ్రీనివాసరావు, కళాకారులు, సాహితీ ప్రముఖులు తదితరులు హాజరయ్యారు.

ఆలోచింపజేసిన నాటికలు



అనూహ్యం నాటికలోని సన్నివేశం

భీమవరం : భీమవరం గునుపూడి శ్రీ ఉమాసోమేశ్వరస్వామి జనార్ధన స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కళారంజని 13వ వార్షికోత్సవ జాతీయ స్థాయి నాటిక పోటీలు అలరిస్తున్నాయి. మొదటి ప్రదర్శనగా పాలకొల్లు వారి అనూహ్యం నాటిక ప్రదర్శించారు. రెండో ప్రదర్శనగా ఆరాధన ఆర్ట్ గుంటూరు వారి క్షేత్రం నాటిక ప్రదర్శించారు. రైతులు తమ క్షేత్రంలో పంట పండించక పోతే మానవజాతికి తిండి ఉండదు. త్రిమూర్తులు కడుపు పంట పండించకపోతే మానవ సృష్టి ఉండదు. మేధావులు మహానుభావులు పుట్టింది ఆ క్షేత్రం నుంచే.. అలాంటి క్షేత్రాలను కాపాడుకుందాం.. ఆడపిల్లలను బతకనిద్దాం, బతికించుకుందాం అని చెప్పే నాటిక క్షేత్రం. ఈ నాటికకు రచన శిల్పా ఆకురాతి కాగా.. దర్శకత్వం జీవి మనోహర్ వహించారు. మూడో ప్రదర్శనగా శ్రీ షిరిడి సాయి కల్చరల్ క్రియేషన్స్ అనకాపల్లి వారి 'మలి సంధ్య' నాటిక ప్రదర్శించారు.

సార్వా సాగుకు సన్నద్ధం

- జిల్లాలో 2.11 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 1,800 క్వింటాళ్ల వరి విత్తనాలు సరఫరా
- ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం



తాడేపల్లిగూడెం ప్రాంతంలో సార్వా వరి నారుమడికి దుక్కు దున్నుతున్న దృశ్యం

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో రైతన్నలు సార్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలోని 20 మండలాల్లో దాళ్వా వరి పంట మాసూళ్లు 90 శాతం పైగా పూర్తికావడంతో రైతులు సార్వా సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో అనేకమంది రైతులు వరి నారుమళ్లకు దుక్కులు ప్రారంభించారు. మిగిలిన ప్రాంతాల్లో పొలాల్లోని ఎత్తు, పల్లాలను సరిచేయడం, మెట్టదుక్కులు చేయడం, గట్టు లంకలు వేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 2,11,256 ఎకరాల్లో సార్వా వరినాట్లు వేయాల్సివుండగా దీనికి అనుగుణంగా వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. రైతులతో ముందుగా నాట్లు వేయించి అధిక దిగుబడులు సాధించే లక్ష్యంలో రైతులను ప్రోత్సహించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుత సార్వా సీజన్‌కు అనుకూలంగా ఎంటీయూ 1318, స్వర్ణ రకాలు మేలైనవని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు.

మట్టి నమూనాల సేకరణ

వరినాట్లు వేసే భూముల్లో వంగడాలకు అనువుగా ఎరువులు వేసుకోవాలి. రైతులు విచ్చల విడిగా ఎరువులు వాడడం వల్ల ఖర్చులు పెరగడమే గాక పంట తెగుళ్ల బారిన పడుతోంది. భూములకు అనుగుణంగా ఎరువులు వాడుకోడానికి ముందుగా భూసార పరీక్షలు నిర్వహించడానికి మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. ప్రస్తుత పంట కాలానికి జిల్లాలో 5 వేల నమూనాలు సేకరించాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా నిర్ణయించుకుంది. రైతు భరోసా కేంద్రాల వారీగా నమూనాలు సేకరించి తాడేపల్లిగూడెంలో భూసార పరీక్షలు నిర్వహించి వాటి వివరాలను రైతులకు అందచేస్తారు. భూసార పరీక్షలను బట్టి ఎరువులు వాడుకోవచ్చు.


ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు సిద్ధం

జిల్లాలో సుమారు 47వేల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా ఎక్కువశాతం రైతులు సేకరించుకోవడం పరిపాటి. అయినప్పటికీ ఆర్బీకేల్లో 1,800 క్వింటాళ్ల విత్తనాలను కిలో రూ.5 రాయితీపై సరఫరా చేయడానికి సిద్ధం చేస్తున్నారు. 58,905 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. రైతులకు అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయిస్తారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించుకోడానికి, ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోడానికి ఈ క్రాప్ బుకింగ్ తప్పని సరిగా చేయించుకోవాలి.

పొలం బడితో రైతులకు అవగాహన

సార్వా వరి సాగులో రైతులు విచక్షణారహితంగా ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా పొలం బడి పేరుతో రైతులకు సమావేశాలు నిర్వహించి పెట్టుబడులు శాస్త్రీయంగా ఉండేలా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలోని 95 రైతు భరోసా కేంద్రాల పరిధిలో పొలం బడి నిర్వహిస్తారు.

అంతా సన్నద్ధం



జిల్లాలో సార్వా సీజన్‌కు పూర్తి ప్రణాళిక సిద్ధం చేశాం. సుమారు 2.11 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయాల్సివుండగా అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సిద్ధం చేస్తున్నాం. రైతులు ముందుగా నాట్లు వేసుకుని అవసరం మేరకు ఎరువులు వాడుకోవడంతో పెట్టుబడి ఖర్చులు తగ్గడమేగాక అధిక దిగుబడులు సాధించవచ్చు.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

భీమవరం (ప్రకాశం చౌక్): సాధారణ ఎన్నికలలో భాగంగా కౌంటింగ్ ప్రక్రియ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని, ఇందులో లోటుపాట్లకు తావులేకుండా చూడాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ కోసం సన్నద్ధంగా ఉండాలని, ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో బందోబస్తుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని, వెంటనే ట్రాఫిక్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద రెయిన్ ప్రూఫ్ టెంట్ల ఏర్పాటు చేపట్టాలని ఆదేశించారు. అధిక సంఖ్యలో లెక్కింపు కేంద్రాల వద్దకు వివిధ పార్టీల కార్యకర్తలు, ప్రజలు చేరుకునే అవకాశం ఉన్నందున భారీ వాహనాలను అనుమతించకుండా దారి మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల ప్రవేశ మార్గంలో గుర్తింపు కార్డులు కలిగిన వ్యక్తులను మాత్రమే అనుమతించాలన్నారు. స్ట్రాంగ్ రూంల వద్దనే కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎంలను కౌంటింగ్ రూంలకు షిఫ్ట్ చేసి కౌంటింగ్ ప్రారంభిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ప్రవేశించే వారికి సెల్ ఫోన్ అనుమతి ఉండదన్నారు. జూన్ 4 ఉదయం ఎనిమిది గంటలకు ఓట్లు లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. లెక్కింపు వివరాలను డిస్‌ప్లే బోర్డులో ప్రదర్శిస్తారన్నారు.

క్లుప్తంగా

కాలువలోకి దూసుకెళ్లిన కారు



ప్రమాదంలో కాలువలో కల్వర్టును ఢీకొని ఉన్న కారు

చాట్రాయి: ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పిన ఓ కారు పంటకాలువలోకి దూసుకెళ్లింది. వివరాలిలా ఉన్నాయి. విస్సన్నపేట నుంచి వస్తున్న ఓ కారు చనుబండ గ్రామంలోకి వచ్చేసరికి ఇద్దరు మైనర్లతో ముందు వెళుతున్న ద్విచక్రవాహనం అకస్మాత్తుగా మలుపు తిప్పడంతో ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి కారు దూసుకువెళ్లింది. ఈ ఘటనలో కారు కాలువపై ఉన్న కల్వర్టును ఢీకొనడంతో ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి గాయాలు కాలేదు. అయితే ఇద్దరు బాలురకు స్వల్ప గాయాలు కావడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

గురజలో గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజ రహదారి సమీపంలో శనివారం రాత్రి గ్యాస్ పైప్‌లైన్ లీకేజీతో స్థానికులు, వాహనచోదకులు భయభ్రాంతులకు గురయ్యారు. మండవల్లి మండలం పెరికేగూడెం నుంచి గుడ్లవల్లేరు మండలం డోకిపర్రుకు ఒక ప్రముఖ సంస్థ గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటు చేసింది. ఈ పైప్‌లైన్ గురజ సమీపంలోని పెట్రోల్ బంకుకు ఎదురుగా పెద్ద శబ్దంతో లీకేజీ కావడంతో స్థానికులు ఆందోళనకు గురై ఇళ్లల్లోని విద్యుత్ లైట్లను ఆర్పివేశారు. అదృష్టవశాత్తు మంటలు రాకపోవడంతో పెద్దప్రమాదం తప్పినట్లు స్థానికులు చెప్పారు. పైప్‌లైన్ లీకేజీ జరిగిన ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న టెలిఫోన్ స్తంభాన్ని దొంగిలించేందుకు గుర్తు తెలియని వ్యక్తి జేసీబీతో తవ్వడం వల్లే ఈ లీకేజీకి కారణమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకట్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వాహనాల రాకపోకలను నిలిపివేసి గుడివాడ అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. పైప్‌లైన్ ఏర్పాటు చేసిన సంస్థ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. గతంలో సైతం ఇదే పైప్‌లైన్ పెనుమల్లి శివారు సింగారం వద్ద లీక్ అయి భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. పైప్‌లైన్ రహదారి వెంబడి ఉన్నందువల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయనే అభిప్రాయాన్ని స్థానికులు వ్యక్తం చేశారు.

పాము కాటుకు మహిళ మృతి

టి.నరసాపురం: పాము కాటుకు గురై ఓ మహిళ మృతి చెందింది. ఎస్సై దుర్గామహేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన రాజుబోయిన రామలక్ష్మి (26) శనివారం ఆయిల్‌పామ్ తోటలో గెలల కోసే పనికి వెళ్లింది. అక్కడ పాము కాటు వేయడంతో గమనించిన తోటి కూలీలు టి.నరసాపురం పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కళ తప్పిన కొల్లేరు

- మైదాన ప్రాంతాన్ని తలపిస్తున్న మంచినీటి సరస్సు
- బీటలు వారిన చిత్తడి నేల.. మాయమైన పచ్చదనం
- ఆహారం, నీరు లేక అల్లాడుతున్న వలస పక్షులు
- ఆటపాక పక్షుల కేంద్రంపై ప్రభావం
- వర్షాభావ పరిస్థితుల వల్ల కొల్లేరులో తగ్గిన డ్రెయిన్ల నీరు



కైకలూరు: కోటి అందాల కొల్లేరు కళ తప్పింది. నీరు లేక ఎడారిని తలపిస్తోంది. పచ్చదనం మాయమైంది. విడిది కోసం వలస వచ్చే అతిథి పక్షులు నీటి కోసం, ఆహారం కోసం అల్లాడుతున్నాయి. కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి 67 డ్రెయిన్లు, వాగుల ద్వారా లక్షా 10 వేల క్యూసెక్కుల నీరు వరదల సమయంలో కొల్లేరుకు చేరుతోంది. ప్రధానంగా బుడమేరు, తమ్మిలేరు డ్రెయిన్ల నుంచి నీరు వస్తుంది. ఒక్క కృష్ణా జిల్లా నుంచే వివిధ డ్రెయిన్ల ద్వారా 35 వేల 590 క్యూసెక్కుల నీరు కొల్లేరులో కలుస్తోంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది కొల్లేరులోకి నీటి ప్రవాహం తగ్గింది. దీంతో నీరు లేక లక్షలాది ఎకరాల కొల్లేరు భూములు బీటలు వారుతున్నాయి.

189 రకాల పక్షులకు కొల్లేరే ఆధారం

ఏటా సైబీరియా, ఆస్ట్రేలియా, నైజీరియా వంటి పలు దేశాల నుంచి వలస పక్షులు విడిది కోసం కొల్లేరు సరస్సుకు వస్తాయి. మొత్తం 189 రకాల పక్షులు కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఏటా డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలలు పక్షుల సంతానోత్పత్తికి అనుకూలం. కొల్లేరులో నీరు లేకపోవడంతో పక్షులకు వేట కరువైంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఎండలు పెరిగాయి. రాష్ట్రంలోనే పక్షుల విహార కేంద్రంగా పేరు గడించిన ఆటపాక పక్షుల కేంద్రంలో 289 ఎకరాల విహార చెరువులో నీటి కొరత ఏర్పడింది. చెరువులో కనీసం 6 అడుగుల నీటిమట్టానికి గాను కేవలం ఒక అడుగు మాత్రమే నీరు ఉంది. దీంతో బోటు షికారును నిలిపివేశారు. ప్రస్తుతం కేంద్రం వద్ద పెలికాన్ పక్షులు 619, పెయింటెడ్ స్టార్క్ పక్షులు 320, ఓపెన్ బిల్డ్ స్టార్క్ పక్షులు 165 ఉన్నాయి. కొల్లేరులో పూర్తిగా నీరు ఉన్నప్పుడు పక్షులు ఇతర ప్రాంతాల్లో వేట సాగించేవి. ఇప్పుడు కేవలం పక్షుల కేంద్రం చెరువులో ఆహారంపైనే ఆధారపడ్డాయి.



కొల్లేరులో పెద ఎడ్లగాడి వంతెన వద్ద ఇలా..

రెగ్యులేటర్ నిర్మించాలి



కొల్లేరులో నీరు ఎల్లప్పుడు నిల్వ ఉండాలంటే కచ్చితంగా రెగ్యులేటర్ నిర్మించాలి. రెగ్యులేటర్ వల్ల సముద్రపు నీరు ఎగబాకకుండా నిరోధించవచ్చు. ఉప్పునీరు రావడం వల్ల కొల్లేరు నల్లజాతి చేపలు అంతరిస్తున్నాయి. కొల్లేరు పరివాహక ప్రాంత ప్రజలు చేపల వేట సాగించాలంటే రెగ్యులేటర్ ఒక్కటే మార్గం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెగ్యులేటర్ నిర్మాణానికి కృషి చేస్తున్నారు.

– ముంగర గోపాలకృష్ణ, మాజీ ఎంపీపీ, చింతపాడు

డ్రెయిన్ల నుంచి నీటి రాక తగ్గింది



కొల్లేరులోకి 67 డ్రెయిన్ల నుంచి నీరు చేరుతోంది. పెద ఎడ్లగాడి నుంచి సర్కారు కాల్వ మీదుగా సముద్రానికి ఈ నీరు పారుతుంది. ఎండల కారణంగా డ్రెయిన్ల నీరు కొల్లేరుకు చేరలేదు. పెద ఎడ్లగాడి వద్ద గతంలో నీటి ప్రవాహానికి అడ్డుగా మారిన గుర్రపుడెక్కన తొలగించాం. రుతుపవనాల కారణంగా వర్షాలు కురిస్తే పరిస్థితి చక్కబడుతోందని భావిస్తున్నాం.

– బి.ఇందిరా, డ్రెయినేజీ శాఖ ఏఈఈ, కైకలూరు

సముద్రపు నీరు కొల్లేరులోకి..

కొల్లేరులో నీరు లేకపోవడంతో సముద్రపు ఉప్పునీరు పైకి ఎగదన్నుతోంది. దీంతో పంటపొలాలు చౌడబారుతున్నాయి. ఇప్పటికే ఏలూరు జిల్లా కలిదిండి మండలం ఉప్పుటేరు పరివాహక ప్రాంతాల్లో లక్షలాది ఎకరాల భూములు చౌడుబారాయి. ఎగువ నుంచి కొల్లేరుకు చేరే నీరు పెద ఎడ్లగాడి, చిన ఎడ్లగాడి డ్రెయిన్లకు చేరుతోంది. ఇక్కడ నుంచి 40 కిలోమీటర్ల దూరంలోని కృత్తివెన్ను వద్ద సముద్రంలో కలుస్తుంది. ఉప్పునీరు చేరడంతో కొల్లేరులో సహజజాతి చేపలు అంతరించిపోతున్నాయి.

కన్నులపండువగా వెంకన్న కల్యాణం



కాళ్లకూరులో గరుడసేవ నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్ళకూరులో శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభూః శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీస్వామివారి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం శ్రీస్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెల అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ముందుగా గ్రామంలో స్వామివారిని గరుడ సేవ నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో గాజువాకకు చెందిన కాండూరి వెంకట రమణాచార్యులుతో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వేద పండితులు, ఆలయ అర్చకుల సమక్షంలో కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. స్వామి వారి కల్యాణం తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు చుట్టుపక్కల గ్రామాల నుంచి విచ్చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.అరుణ్ కుమార్, ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జనసేన నాయకుడి దౌర్జన్యం

- మహిళ, మరో ఇద్దరిపై దాడి
- నరసాపురం ఆస్పత్రిలో బాధితులకు చికిత్స

నరసాపురం: ఎన్నికల ఫలితాలు వెలువడక ముందే నరసాపురంలో జనసేన నాయకులు రెచ్చిపోతున్నారు. మొగల్తూరు మండలం కేపీపాలెం బీచ్ సమీపంలో ఆటోలో వెళుతున్న ఓ కుటుంబంపై జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అనుచరుడు బళ్ల బాబి ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో దాడి చేశాడు. ఓ మహిళను, మరో ఇద్దరిని తీవ్రంగా గాయపరిచాడు. వివరాలిలా ఉన్నాయి.. లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన కడలి శ్రీనివాస్ ఇంటికి ఆచంట వేమవరానికి చెందిన బొక్కా శ్రీనివాస్ అతని భార్య లక్ష్మి మరికొందరు బంధువులు వచ్చారు. వీరంతా కలిసి ఆటోలో పేరుపాలెం బీచ్‌కు వెళ్లారు. అదే ఆటోలో తిరిగి వస్తుండగా తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన జనసేన చోటా నాయకుడు బళ్ల బాబి, అతడి స్నేహితులు మరో ముగ్గురు కారులో వస్తున్నారు. కారుకు ఆటో సైడ్ ఇవ్వలేదనే కోపంతో ఆటోను వెంబడించి కేపీపాలెం గ్రామం వద్ద ఆపారు. అసలు విషయం పక్కన పెట్టిన అసలు మీరు ఎవరు? మొన్న ఎన్నికల్లో జనసేనకు ఓటు వేశారా? వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారా అంటూ బాబి వారిని నిలదీశాడు. మీరు బీసీల్లా ఉన్నారు.. మీరు వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి ఉంటారంటూ వారిపై బాబి, అతడి స్నేహితులు దాడి చేసి అక్కడి నుంచి జారుకున్నారు. దీంతో లక్ష్మితో పాటు బొక్కా శ్రీనివాస్, కడలి శ్రీనుకు గాయాలయ్యాయి. వారిని స్థానికులు నరసాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నరసాపురం డీఎస్పీ జి.శ్రీనివాస్ ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అయితే కేసులో పోలీసులు జనసేన నేత బళ్ల బాబీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ బాధితుల బంధువులు ఆందోళన చేశారు. బాబీని కొంతసేపు ఆస్పత్రిలోని ప్రత్యేక గదిలో ఉంచిన పోలీసులు అతడిని రూరల్ స్టేషన్‌కు తరలించారని, కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని బాధితుల బంధువులు ఆరోపిస్తున్నారు.



ఆస్పత్రిలో బాధితురాలు లక్ష్మీని పరామర్శిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్



బళ్ల బాబిని తీసుకువెళుతున్న పోలీసులు

కోటిజన్మల ఫలం అతిరాత్ర మహాయాగం

సంప్రదాయబద్ధంగా 108 మంది రుత్వికులతో కోటి గాయత్రీ జపం

భీమవరం (ప్రకాశం చౌక్): కోటి జన్మల ఫలం అతిరాత్ర మహాయాగమని, యజ్ఞ యాగాలతో లోకశాంతి అని యజ్ఞకర్తలు జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ, ధూళిపాల లలితశాస్త్రి, కర్ణాటక ఋత్వికులు సాకేత్ శర్మ, కేశవ్ శర్మ, తూర్పుగోదావరి జిల్లా ముక్కామల పీఠాధిపతి శ్రీ శ్రీధర స్వామి, పశ్చిమ గోదావరి జిల్లా చిక్కాల గ్రామంలోని లలితా పీఠం పీఠాధిపతి ర్యాలీ కృష్ణప్రసాద్ అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాలలో జరుగుతున్న అతిరాత్ర మహాయాగాలు ఐదో రోజుకు చేరుకున్నాయి. యాగంలో భాగంగా 108 మంది రుత్వికులచే కోటి గాయత్రీ జపాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి మహాయజ్ఞాలను పూర్వం వైభవంగా నిర్వహించేవారని, లోకశాంతి కోసమే యజ్ఞయాగాలన్నారు. గాయత్రీ ఉపాసకులు బ్రహ్మశ్రీ మిర్తిపాటి వెంకటరామయ్య మాట్లాడుతూ గాయత్రీ మంత్రం పవిత్రమైనదని, ఒక్కసారి గాయత్రీ మంత్రం జపిస్తే జీవితానికి సార్థకత చేకూరుతుందని, కోటి గాయత్రీ యజ్ఞంతో చుట్టుపక్కల ప్రాంతాలన్నీ సస్యశ్యామలంగా ఉంటాయన్నారు. ప్రవచన కర్తగా విచ్చేసిన తూర్పుగోదావరి జిల్లా ముక్కామల పీఠాధిపతి శ్రీ శ్రీధరస్వామి సనాతన ధర్మ పరిరక్షణలో యజ్ఞ యాగాల ఆవశ్యకతను వివరించారు. లలితా పీఠం పీఠాధిపతి ర్యాలీ కృష్ణ ప్రసాద్ ఈ యజ్ఞాన్ని సందర్శించి కోటి జన్మల ఫలం ఈ యాజ్ఞంతో కలుగుతుందన్నారు. నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల దంపతులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వర రావు, వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి వడుపు గోపి, యజ్ఞ పర్యవేక్షకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, నడింపల్లి బంగారాజు, నరహరిశెట్టి కృష్ణ, న్యాయవాది తాడిమళ్ళ గిరి పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు యధావిధిగా నిరంతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



యాగం నిర్వహిస్తున్న రుత్వికులు

కూటమికి పరాభవం తప్పదు

పాలకొల్లు అర్బన్: ఓట్ల లెక్కింపు అనంతరం చంద్రబాబు కూటమికి ఘోర పరాభవం తప్పదని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పాలకొల్లు హౌసింగ్‌బోర్డు కాలనీలోని మాలమహానాడు కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను రాష్ట్రంలోని పేదలందరికీ అందించడం వలన ప్రజలు కృతజ్ఞతతో ఓటు వేశారన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లి గంటల తరబడి లైన్‌లో నిలబడి ఓటు వేశారన్నారు. రాష్ట్రంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తే వైఎస్సార్ సీపీ 130 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించబోతోందన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి విశాఖలో ప్రమాణ స్వీకారం చేయనున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని సర్వేలు వైఎస్సార్ సీపీ అత్యధిక అసెంబ్లీ స్థానాలు గెలవబోతున్నట్లు స్పష్టం చేస్తున్నాయని వివరించారు. బొందా మోహన్‌రావు, ఎం.శ్రీను పాల్గొన్నారు.



పాలకొల్లులో మాట్లాడుతున్న మంగరాజు

అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

నూజివీడు: టైర్ పేలి ఆయిల్ ట్యాంకర్ లారీ బోల్తా కొట్టిన ఘటనలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో మీర్జాపురంలోని కచ్చా డ్రెయిన్‌లో మంటలు చెలరేగాయి. వివరాలిలా ఉన్నాయి. ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడటంతో ట్యాంకర్‌లోని పెట్రోలు, డీజిల్ లీకేజీ కాగా, దీనిని మురుగు కాల్వలోకి మళ్లించారు. క్రేన్‌ల సాయంతో బోల్తా పడిన ట్యాంకర్‌ను పైకిలేపి పంపించి వేశారు. అయితే ఆకతాయి సిగరెట్ వెలిగించేందుకు వేసిన అగ్గిపుల్లతో మురుగుకాల్వలో మంటలు ఏర్పడగా, రూరల్ సీఐ రామకృష్ణ, రూరల్ ఎస్సై మల్లికార్జున రెడ్డి అప్రమత్తమై అగ్నిమాపక కేంద్రాలకు సమాచారాన్ని అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. గ్రామస్తులు కూడా ఇసుకను మంటలపై పోస్తూ శ్రమించారు. పక్కనే పెట్రోలు బంకు ఉండటంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మంటలు అదుపులోకి రావడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.

తాళ్లకోడేరులో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



తాళ్లకోడులో జగనన్న లేఅవుట్‌లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్న దృశ్యం

ఆకివీడు: ఎన్నికలు, ఫలితాలను దృష్టిలో పెట్టుకుని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకునే చర్యల్లో భాగంగా ఆదివారం మండలంలోని తాళ్లకోడు జగనన్న కాలనీ ప్రాంతంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. ప్రతి ఇంటిలో క్షుణ్ణంగా సోదాలు చేశారు. కాలనీలోకి కొత్త వ్యక్తుల ప్రవేశం, గంజాయి, మందు తదితర వాటి ప్రభావం లేకుండా చూసేందుకు ఆకస్మిక తనిఖీలు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు చెప్పారు. తనిఖీల్లో ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

ఆకివీడు: లారీ నడుపుతూ గుండెపోటుకు గురై ఓ డ్రైవర్ మృతి చెందాడు. ఎస్సై బి.నాగబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన బండి కిషోర్ (39) లారీ డ్రైవర్. ఆదివారం చేపల మేత లోడుతో తూర్పుగోదావరి జిల్లాకు బయలుదేరాడు. గుమ్ములూరు సెంటర్‌లోని బంకులో లారీలో డీజిల్ పోయించుకుని రోడ్డుపైకి వచ్చిన కొద్ది నిమిషాలకే గుండెపోటు రావడంతో లారీని పక్కకు ఆపుతూ ప్రాణాలు ఒదిలాడు. కిషోర్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

డ్రెయిన్‌లోకి దూకి వ్యక్తి ఆత్మహత్య

భీమవరం: యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విస్సాకోడేరు గ్రామానికి చెందిన కె.నాగశ్రీను (29) కాళ్ల మండలం సీసలిలోని ఓ రొయ్యల కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 15న విధులకు హాజరయ్యాడు. అదే రోజు సాయంత్రం బంధువులకు ఫోన్ చేసి యనమదుర్రు కాలువలోకి దూకి చనిపోతున్నట్లు చెప్పాడు. బంధువులు భీమవరంలోని ప్రకాశంచౌక్ కూడలిలోని పెద్ద వంతెన గట్టు వద్దకు వచ్చి చూడగా, అక్కడ ద్విచక్రవాహనం కనిపించడంతో 16న పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం అతని మృతదేహాన్ని డ్రెయిన్‌లో గుర్తించారు. ఎస్సై మాణిక్యమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సందేశాత్మకంగా నాటిక ప్రదర్శనలు

యలమంచిలి: కొంతేరు గ్రామంలోని శ్రీపులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిర్ ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్న 42వ అఖిల భారత స్థాయి నాటిక పోటీలలో చివరి రోజు ఆదివారం రెండు నాటికలు ప్రదర్శించారు. బతికుండగానే చనిపోయినట్లు నటించి ఎల్ఐసీ డబ్బులు కాజేయాలని చూసిన పిసినారి దంపతుల నాటకాన్ని పసిగట్టి వారికి బుద్ధి చెప్పి చివరకు మనం ఎంత సంపాదించినా చివరకు మిగిలేది బూడిదేనని బూడిద నాటిక చాటి చెబితే.. బతికుండగా పంతాలకు పోయి జీవితాంతం ఒంటరిగా జీవించి, జీవిత చరమాంకంలో కలిసి జీవిద్దామన్నా ఆ అవకాశం ఉండదని నిరూపించిన కథ మళ్లీ కలిసి జీవిద్దాం. ఈ రెండూ కూడా భిన్నమైన కథనంతో సందేశాత్మకంగా సాగి ఆహుతులను ఉత్తేజితులను చేశాయి.

పిసినారి దంపతులకు బుద్ధి చెబుతూ..

పిసినారులైన పానకాలు, మంజుల దంపతులు తాము తినకుండా, ఇతరులకు పెట్టకుండా జీవిస్తుంటారు. పైపెచ్చు అడ్డదారిలో సంపాదన మార్గాలు అన్వేషిస్తుంటారు. ఈ క్రమంలో పానకాలు బతికుండగానే చనిపోయినట్లు చెప్పి అక్రమంగా ఎల్ఐసీ డబ్బులు తీసుకోవడానికి ప్రయత్నిస్తారు. వీరి నాటకాన్ని పసిగట్టిన పానకాలు మేనమామ బలిదానం వారికి బుద్ధి చెప్పడానికి ఎల్ఐసీ ఆఫీసర్, డాక్టర్‌తో కలిసి అంతర్నాటకమాడతాడు. ఎల్ఐసీ డబ్బులు రావాలంటే పోస్టుమార్టం చేయాలని చెప్పడంతో ఆ దంపతుల మోసం బయటపడుతుంది. ఎంత సంపాదించినా చివరకు మనమంతా బూడిదలో కలుస్తామని చెప్పి ఆ దంపతుల్లో ఏ విధంగా మార్పు తీసుకువచ్చాడో హైదరాబాద్ శ్రీ యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ వారు ప్రదర్శించిన బూడిద నాటిక విశదీకరించింది. ఈ నాటకాన్ని అక్కల తామేశ్వరయ్య రచించగా, వడ్డాది సత్యనారాయణ దర్శకత్వం వహించారు. ఈ నాటికలో జబర్దస్త్ ఫేం గుండు మురళీధర్ ఎల్ఐసీ ఆఫీసర్‌గా నటించారు.

బిడ్డలను దూరం చేసుకుని భార్య జ్ఞాపకాలతో..

సత్యనారాయణమూర్తి, లీలావతి దంపతులు. వారికి చంద్రశేఖర్, గాయత్రి పిల్లలు. గాయత్రికి తన భర్తతో పడకపోవడంతో విడాకులు తీసుకుంటుంది. అన్న చంద్రశేఖర్ దగ్గరుండి ఆమెకు మరో వ్యక్తితో రెండో వివాహం జరిపిస్తాడు. ఇది ఇష్టంలేని సత్యనారాయణమూర్తి ఇద్దరు బిడ్డలను ఇంటి నుంచి పంపించేస్తాడు. ఈ క్రమంలో లీలావతి చనిపోతుంది. దీంతో సత్యనారాయణమూర్తి ఒంటరివాడవుతాడు. అయినా పిల్లలను తన దగ్గరకు రానివ్వకుండా అనుక్షణం భార్య జ్ఞాపకాలతో జీవిస్తుంటాడు. భార్యతో ఒంటరిగా మాట్లాడుతుంటాడు. పిల్లల దగ్గరకు వెళ్లమని భార్య చెప్పినా వినడు. చరమాంకంలో భార్య మాట విని బిడ్డలకు దగ్గరకు వెళ్లి మళ్లీ కలిసి జీవిద్దామనుకునే సమయంలో మరణిస్తాడు. ఈ నాటికను శారద ప్రసన్న రచించగా, ద్వాదశి వెంకట చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు.



బూడిద నాటిక ప్రదర్శనలోని ఓ దృశ్యం

రోడ్డు ప్రమాదంలో మొబైల్ టెక్నీషియన్ మృతి

జంగారెడ్డిగూడెం: పట్టణ పరిధిలోని హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కోన సాయి (23) మొబైల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. పట్టణానికి చెందిన గుర్రం రాజ్‌కుమార్ పదో తరగతి పాసై ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. వీరిద్దరూ స్నేహితులు. రాజ్‌కుమార్ తూర్పుగోదావరి జిల్లా జగన్నాథపురంలోని తన నాయనమ్మ ఇంటికి వెళ్లేందుకు కోన సాయిని సహాయం కోరగా, ఇద్దరూ మోటార్‌సైకిల్‌పై ఆదివారం బయలుదేరారు. జాతీయ రహదారిపైకి వచ్చేసరికి వీరిని కొయ్యలగూడెం నుంచి జీలుగుమిల్లి వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కోనసాయి ఘటనా స్థలంలోనే మృతి చెందగా, రాజ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రాజ్‌కుమార్‌ను ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించారు. సాయి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కోన సాయి (ఫైల్)

నేటి నుంచి కర్రసాముపై ఉచిత శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఏపీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నుంచి కర్రసాము ఉచిత వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. ప్రతి రోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి ఏఆర్‌డీజీకే హైస్కూల్‌లో ఈ శిక్షణ ఉంటుందని తెలియజేశారు. స్థానిక ఇండోర్ స్టేడియం ఎదురుగా గల లేడీస్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన మానవత వార్షిక సమావేశంలో కర్రసాము శిక్షణ శిబిరం ఫ్లెక్సీలను, ప్రచార కరపత్రాలను హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. కె.శ్రీనివాసరావు 93469 36521 ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

ఆవకాయపై ధరాఘాతం

- పెరిగిన పచ్చడి తయారీ ఖర్చులు
- తగ్గిన మామిడికాయల కొనుగోళ్లు



తణుకులో మార్కెట్‌లో పచ్చడి మామిడికాయల అమ్మకాల దృశ్యం

తణుకు టౌన్: తెలుగు వారి సంప్రదాయ ఆవకాయ పచ్చడి రానురానూ భారంగా మారింది. ఒక వైపు ప్రకృతి కారణంగా మామిడికాయలు పంట తగ్గిపోవడంతో పాటు మరోవైపు ధరల పెరుగుదల కారణంగా భారంగా మారిపోయింది. ప్రస్తుతం తణుకు మామిడి కాయాల మార్కెట్‌లో మామిడికాయల పెరిగిపోవడంతో వెలవెలబోతుంది. రాష్ట్రంలోని నూజివీడు, కత్తిపూడి, జగ్గంపేట తదితర ప్రాంతాల నుంచి తణుకు మార్కెట్‌కు మామిడి కాయలు వస్తున్నాయి. మామిడి కాయల ధరలు గత సంవత్సరం కంటే రెట్టింపు ధరలు పలకడంతో ఇటు వినియోగదారులు, వ్యాపారులు దిగాలుగా ఉన్నారు.

ధరలు ఇలా

తణుకు మార్కెట్‌లో కొత్తపల్లి కొబ్బరి రకం మామిడి కాయలు 100 కాయలు రూ.5,800 పలుకుతున్నాయి. వీటితో పాటు మామిడి కాయలు ఒక్కో కాయ ధర రూ 60లపైనే పలుకుతున్నాయి. గత సంవత్సరం రూ.25లు ఉన్న కొత్తపల్లి కొబ్బరి రూ.50 నుంచి 60 వరకూ, గత సంవత్సరం రూ.20 ఉన్న పెద్ద రసాలు రూ. 25 నుంచి 30 వరకూ, గత సంవత్సరం రూ.10 ఉన్న చిన్న రసాలు, రూ. 15 నుంచి 20 వరకూ, గత సంవత్సరం రూ.12 ఉన్న సువర్ణ రేఖ రకం మామిడి రూ.20, గత సంవత్సరం రూ.20 ఉన్న ఆయ్యగార్లు నేడు రూ. 30 నుంచి 40లు, గత సంవత్సరం రూ.10లు ఉన్న ఇతర దేశవాళీ రకం మామిడి కాయలు రూ. 20 నుంచి 25కు చేరాయి. సాంప్రదాయ అవకాయ, మాగాయ వంటి నిల్వ పచ్చళ్లు తయారు చేసుకునే వారికి ధరలతో నిరాశతో తక్కువ గతం కంటే తక్కువ మొత్తంలో పచ్చడి పట్టుకోవడానికి సిద్ధం అవుతున్నారు.

పంట దిగుబడి తగ్గింది



ఈ సంవత్సరం మామిడి పంట బాగా తగ్గిపోయింది. దీనితో ఉన్న కొద్దిపాటి పంట వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేయడంతో తణుకు మార్కెట్‌కు ఇతర ప్రాంతాలైన నూజివీడు, కత్తిపూడి, జగ్గంపేట తదితర ప్రాంతాల నుంచి మామిడి కాయల సరఫరా తగ్గిపోయింది. దీనితో మామిడి కాయల అమ్మకాలు తగ్గిపోయాయి.

– చెన్నా సత్యనారాయణ, వ్యాపారి, తణుకు.

కొనుగోళ్లు తగ్గాయి



సాధారణంగా వేసవిలో నిల్వ పచ్చళ్లు పట్టేందుకు గతంలో మాదిరిగా ఎక్కువ మొత్తంలో మామిడి కాయలు కొనుగోలు చేయడంలేదు. మారిని జీవన శైలితో పాటు నిల్వ పచ్చళ్లపై ఆసక్తి తగ్గుతుంది. ఈ సంవత్సరం మామిడి పంట తగ్గిపోవడంతో ఉన్న కాయలకు డిమాండ్ పెరిగి ధరలు పెరిగాయి.

– దున్నా నాగరాజు, వ్యాపారి, తణుకు.

లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలు అభినందనీయం



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని డాక్టర్ ఎల్.రవి కుమార్ పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో అధ్యక్షుడు వంగపండు రామోహన్‌రావు పర్యవేక్షణలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ నేత్రవైద్యశాల వైద్యుల బృందంతో కంటి పరీక్షలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్ జిల్లా డిప్యూటీ గవర్నర్ పీఎంజేఎఫ్ పదంకుమార్ గుప్తా ఆర్థిక సహకారం అందజేశారు. 86 మందికి కంటి పరీక్షలు చేశారు. ఉచిత కంటి ఆపరేషన్లు నిమిత్తం 10 మందిని నిడదవోలు పంపారు. 15 మందికి ఉచితంగా కళ్లజోల్లు పంపిణీ చేశారు. రీజియన్ చైర్పర్సన్ పదంకుమార్ గుప్తా, కార్యదర్శి చిన్నం జగదీష్, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, బాపయ్యా శర్మ, పేరూరి కాశయ్య, వీవీఎస్ లక్ష్మీనారాయణ, అంజనేయస్వామి తదితరులు పర్యవేక్షించారు.

నారు పోసేందుకు చేలు సిద్ధం



ఎల్.అగ్రహారంలో నారు పోసేందుకు సిద్ధం చేసిన చేలు

తాడేపల్లిగూడెం రూరల్: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. గత వారం, పది రోజులుగా చెదురు మదురుగా వర్షాలు కురవడంతో నెరలు తీసిన వరి చేలు సాగుకు సిద్ధమయ్యాయి. దీంతో మెట్ట రైతాంగం దుక్కి దున్ని నారు పోసేందుకు భూమిని సిద్ధం చేశారు. ఎల్.అగ్రహారం, కొండ్రుప్రోలు, మోదుగ గుంట, పుల్లాయగూడెం, కృష్ణాపురం, కడియద్ద, కొమ్ముగూడెం, నీలాద్రిపురం, చినతాడేపల్లి, మాధవరం, లింగారాయుడిగూడెం, మెట్ట ఉప్పరగూడెం, అమృతపురం, దండగర్ర, ఉప్పరగూడెం తదితర గ్రామాల్లో ఇప్పటికే భూమిని మాగ దమ్ము చేశారు. మరో రెండు, మూడు రోజుల్లో విత్తనం చల్లనున్నారు. తదుపరి 21 రోజులకు నారు తీసి, నాట్లు వేసే అవకాశం ఉంది. తాడేపల్లిగూడెం మండలంలో దాదాపు 11వేలు హెక్టార్ల పైబడి ఖరీఫ్ సాగు జరగనున్నది. ప్రధానంగా పీఆర్-126 రకం వరి వంగడాన్ని సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. జూన్ రెండో వారంలో దాదాపు నాట్లు పడే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. అల్పపీడన ద్రోణి ప్రభావంతో మరో మూడ్రోజులు వర్షాలు విస్తారంగా కురిసే అవకాశాలు ఉండటంతో రైతాంగం ఖరీఫ్ సాగు పనులను ముమ్మరం చేయనున్నారు.

పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ కేవీబీవీ డైరెక్టర్ బీ మధుసూదన్‌రావు

తణుకు టౌన్: ఆర్థికంగా పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఎస్సీ, ఎస్టీ, ఉద్యోగులు సహకరించాలని స్టేట్ కేవీబీవీ డైరెక్టర్ బీ మధుసూదనరావు కోరారు. ఆదివారం సాయంత్రం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ గంజి మధుసూదన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేవీబీవీ డైరెక్టర్ బీ మధుసూదన్ రావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల్లో అత్యంత ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివించాలని, అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జిల్లా ఏడీసీ పి.శ్యామ్‌సుందర్, మాజీ సీఎంఓ టీటీఎఫ్ రూజ్‌వెల్ట్, ఏలూరు జిల్లా ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ చైర్మన్ ఎ.సర్వేశ్వరరావు, తాళ్లపూడ ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, మురాల సుదాకర్, ఏవీఎస్ రాజన్న, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ, విశ్వాసమే మనల్ని గెలిపిస్తాయి



ఫంక్షన్ హాలును ప్రారంభించిన నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: ప్రేమ, విశ్వాసమే మనల్ని జీవితంలో గెలిపిస్తాయని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. స్థానిక ధర్మాపుర అగ్రహారం లోని చర్చి ఆవరణలో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాలును ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలోని సుమారు 250 మంది ఆడపడుచులకు ఆమె చీర, జాకెట్ ముక్కలను పంపిణీ చేశారు. కౌన్సిలర్ కటికతల జాన్ వెస్లీ మాట్లాడుతూ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సహకరించిన ఐఆర్ఎస్ ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ మరపట్ల విజయ్‌కుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయులు భమిడిపాటి సూర్య భాస్కరరావు, కేవీఎల్ నర్సింహరావు, ఎండీ.మస్తాన్, జేఏస్సార్, కటికతల మోషే, జామి శ్రీనివాస్, రామకూరి సంపతరావు కుటుంబం, లాజర్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గేదల అప్పారావు, దొడ్డి జగదీష్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎండీ.ఆలీ, సంఘ సీ.ఆర్ యు.సుందరరావు, పాస్టర్ సీహెచ్ జార్జి, ప్రసంగీకులు, జీ.సంజీవరావు, కటికతల సువర్ణరాజు, సంఘ పెద్దలు కొడవ శ్యామ్‌బాబు, గోడి కుమార్, కటికతల మోషేరాజు, నైనాల బాల ఏసు,బూరగ దిలీప్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా సుందరయ్య వర్ధంతి



ఇటుకులగుంటలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కండెల్లి సోమరాజు



తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

తణుకు టౌన్: కమ్యూనిస్ట్ యోధుడు పుచ్చపల్లి సుందరయ్య జీవితం నేటి యువతకు స్పూర్తిదాయకం కావాలని వయయవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు కోరారు. ఆదివారం సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని మిని బైపాస్‌లో ఉన్న సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్ట్ పార్టీ పటిష్టతకు కృషి చేసి శ్రామిక వర్గాల అభ్యున్నతికి సుందరయ్య కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో కర్ణాకపు నరసింహారావు, వాసా వెంకటేశ్వరరావు, తిరునాదం వెంకటేశ్వరరావు, విశ్వనాథం సుబ్బారావు, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇటుకులగుంటలో..

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలు, సమాజ మార్పు కోసం తన యావదాస్తిని ప్రజా ఉద్యమానికి ఇచ్చిన నిరాండబరమైన జీవితాన్ని గడిపిన మహోన్నతమైన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని పలువురు సీపీఎం నాయకులు కొనియాడారు. ఆదివారం మండలంలోని ఇటుకులగుంట గ్రామంలో కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ, నాయకుడు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ నాడు సుందరయ్యను కమ్యూనిస్టు గాంధీగా పిలిచేవారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. పాలుపూరి సత్యవతి, ఇ.శ్రీనివాస్, పి.నాగమణి, మన్నే గణేష్, పి.పుష్ప తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో...

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటవీరుడు, స్వాతంత్ర సమరయోధుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి నాయకులు కర్రి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు జవ్వాది శ్రీను, పుట్టా వేణుగోపాల చౌదరి, సిరపరపు రంగారావు, కరెడ్ల రామకృష్ణలు మాట్లాడుతూ సుందరయ్య జీవిత విశేషాలను, చేసిన సేవలు, పోరాటాలను వెల్లడించారు. అలాగే ఉల్లిపాయల మార్కెట్ యూనియన్ ఆఫీస్ వద్ద చల్లా చంద్రరావు అధ్యక్షతన సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. బంకుర నాగేశ్వరరావు, అప్పన్న, దుర్గా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ఎతిభా పురస్కారాలతో విద్యార్థులు, నిర్వాహకులు



ఇంటర్‌లో మండలంలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన సుదీప్తిని సన్మానిస్తున్న దృశ్యం



పదో తరగతిలో ప్రతిభ చూపిన జస్వంత్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం మానవతా సాంఘిక సేవా సంస్థ, భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య యువజన సంఘ భవనంలో ఆదివారం ప్రతిభ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉమ్మడి జిల్లా మానవతా సంస్థ అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు మాట్లాడుతూ విద్య ద్వారానే పేద, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని, అందుకు ప్రతిభ గల విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో మానవత పేరిట ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంస్థ అధ్యక్షుడు బుద్దరాజు వెంకటపతి రాజు, డైరెక్టర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ భీమవరం పట్టణ, మండలంలోని పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన 29 మందికి రూ.44 వేల నగదు అవార్డులతో పాటు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కారుమూరి నరసింహమూర్తి (బాబు), ఎంఈఓ రామకృష్ణ, బీహెచ్ సీతారామరాజు, సంస్థ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ చేకూరి ఝాన్సీ, మానవతా సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం

పాలకోడేరు: శ్రీవాసవి మాత జయంతి పురస్కరించుకుని పదో తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. శృంగవృక్షం హైస్కూల్‌లో చదివి మండలంలోనే ప్రథమ స్థానం సాధించిన ముగ్గళ్ళ జస్వంత్, ద్వితీయ స్థానం సాధించిన లోకేష్, తృతీయ స్థానం సాధించిన రాజశేఖర్, కృష్ణమూర్తి, కూర్మాల సంతోష్, ఇంటర్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన సుదీప్తిలను సత్కరించారు. విద్యార్థులకు కందుల అరుణసంధ్య, కూర్మాల మురళి, నాగరాజు, గ్రంధి రాజా నగదు బహుమతులు అందజేశారు. కందుల చరణ్ దీప్, సహస్ర, పెన్నులు అందించారు. తొలుత వాసవీ మాతకు అభిషేకం, కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం సేవలను శృంగవృక్షం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాశీ జగన్నాథం కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు గ్రంధి రాజా, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, అత్యం వాసు, పూర్ణారావు.,యానాది శెట్టి, కూర్మాల కాశీ, కుసుమ గుప్త, కూర్మాల నరసింహారావు, శ్రీనివాసరావు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కంటి పరీక్షకు సహాయం



వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినికి ఆర్థిక సహాయం చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థిని కంటి వైద్యం నిమిత్తం పట్టణ వాకర్స్ క్లబ్ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం స్థానిక కుళాయి చెరువు గట్టు వద్ద వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు విద్యార్థిని చవ్వాని మేరికి రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. సుధాకరరావు మాట్లాడుతూ స్థానిక బీఆర్ఎంవీ పురపాలక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని మేరి కంటి సమస్యతో బాధపడుతున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారన్నారు. చదువుకునేటప్పుడు ఇబ్బందులు పడుతుందన్నారు. కంటి చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక సమస్యలు తలెత్తడంతో క్లబ్ నుండి ఆర్థిక సహాయం అందించామన్నారు. క్లబ్ సెక్రటరీ షేక్ పీర్‌సాహెబ్, ట్రెజరర్ పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, సలాది రామచంద్రరావు, బొలిశెట్టి నాగరాజు, మేకా త్రిశూల పాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత రథోత్సవం

వీరవాసరం: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవార్ల రథోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. రాయకుదురు ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన చేపట్టారు. శ్రీ వాసవీ మాత ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవార్లను మేళతాళాలతో, బాణాసంచా కాల్పుల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నార్కేడమిల్లి సుబ్బయ్య గుప్తా, పచ్చిగోళ్ళ శ్రీనివాస గుప్తా, సింహాద్రి సాయి రాజేష్, పచ్చిగోళ్ళ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల్లో దడ పుట్టిస్తున్న వాతావరణం



అయిభీమవరం రోడ్డులో యంత్రంతో కోసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ఆకివీడు: దాళ్వా సాగు ఆలస్యం కావడంతో మాసూళ్ల మే నెలాఖరు వరకూ కొనసాగుతున్నాయి. ఈ తరుణంలో వాతావరణం ఇబ్బందులకు గురిచేయదని రైతులు భావించినా గత మూడు రోజులుగా పడుతున్న చెదురుమదురు వర్షాలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. అకాల వర్షాలకు పండిన పంట అతలాకుతలమైపోతుందని వాపోతున్నారు. యంత్రాలతో కోసిన ధాన్యాన్ని గట్టుపైకి తీసుకువచ్చి ఆరబెడుతున్న తరుణంలో ఒక్కసారిగా వాతావరణం మేఘావృత్తమై చినుకులు పడటంతో ధాన్యం ఒబ్బిడి చేయలేక తడిసిపోయే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన చెందుతున్నారు. ప్రకృతి కనికరించకపోతే వేలాది రూపాయల నష్టం వాటిల్లుతోందని చెబుతున్నారు. ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని మిల్లులో సకాలంలో తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన బలుసులమ్మ కల్యాణం



పడాల గ్రామంలోని పూరిగుడిసె వద్ద బలుసులమ్మ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల గ్రామంలో ఉన్న శ్రీబలుసులమ్మ వారి సేవ, జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామానికి చెందిన భక్తులు పిండి వంటలను నివేదించి, భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. పచ్చా రామారావు, పులి సూర్యప్రసాద్, పిచ్చికల రామకృష్ణ, కొత్త వెంకటేశ్వరరావు, మానే అంజి, కొత్త అంజిబాబు, పచ్చా రత్నారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి



అత్తిలి శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

అత్తిలి: విజ్ఞానాన్ని పెంపొందించేందుకు విద్యార్థులు గ్రంథాలయాలను ప్రతినిత్యం వినియోగించుకోవాలని వలంటీర్ బి.నరేంద్రనాధ్ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో చిన్నారులు పుస్తక పఠనం చేశారు. రిసోర్స్‌పర్సన్ కె.కోమలి మాట్లాడుతూ విద్యార్‌ర్ధులు గ్రంథాలయాన్ని సందర్శించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి.కృష్ణా రావు, గ్రామీణ గ్రంథపాలకులు హెచ్‌వీఆర్ కిశోర్ బాబు, ఆర్.దానకృష్ణ, ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



అత్తిలిలో శ్రీవేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అత్తిలి: స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామివారి కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీస్వామివారిని పెండ్లికుమారుడిగా, అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా చేశారు. స్వామి వారికి తులసీదళాలతో అర్చన, విష్వక్సేన పూజ, అగ్ని ప్రతిష్ఠాపన, అమ్మవార్లకు కుంకుమ పూజలు జరిపారు. సోమవారం రాత్రి అత్తిలి గ్రామానికి చెందిన కొనగళ్ల సత్యరత్నకిశోర్, స్రవంతి దంపతులు వాడపల్లి శశికాంతాచార్యులు ఆధ్వర్యంలో శ్రీస్వామివారి కల్యాణం జరుగుతుందని ఆలయ ఈఓ ఆకుల వెంకట నారాయణరావు తెలిపారు. 21న గ్రామోత్సవం, 22న చోరోత్సవం, 23న శ్రీపుష్పోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు స్పష్టం చేశారు.

ప్రశాంతంగా ఈఏపీ సెట్



పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సులలో ప్రవేశాలకు గానూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఏపీఈఏపీ సెట్ నాలుగో రోజున ఆదివారం తాడేపల్లిగూడెంలో ఇంజినీరింగ్ విభాగంలో పరీక్షలు జరిగాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా శ్రీ వాసవిలో నిర్వహించిన పరీక్షకు 250 మందికి గానూ 248 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర రత్నాకర్‌రావు తెలిపారు. పరీక్షా కేంద్రం కో ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్, టీసీఎస్ ప్రతినిధులు పరీక్ష తీరును పర్యవేక్షించారు.

రేపటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

పెంటపాడు: రావిపాడులోని వెంకయ్యకాలువ వద్ద ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 41వ వార్షికోత్సవం పురస్కరించుకుని తిరు కల్యాణ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

వైభవంగా వెంకన్న కల్యాణం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి మందిరంలో ఆదివారం స్వామి వారి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్త మలిశెట్టి పద్మశ్రీ పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి వెంకట ఆనంత కృష్ణమాచార్యులు పర్యవేక్షణలో పెదపూడి గోపాలచార్యులు బ్రహ్మత్వంలో స్వామి వారి కల్యాణ క్రతువు, పెండ్లి కుమారుడు, కుమార్తెలను చేశారు. కళ్యాణంలో ముగ్గురు జంటలు పాల్గొన్నారు. అనంతరం శ్రీ రమ సహిత సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు.

ముగిసిన కనక ముత్యాలమ్మ జాతర

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని తాళ్ల ముదునూరుపాడులో ఉన్న కనక ముత్యాలమ్మ వారి జాతర ఆదివారంతో ముగిసింది. జాతర ప్రతి మూడు సంవత్సరాలకు ఒక్కసారి నిర్వహిస్తున్నారు. సత్తి వారి ఇంటి వద్ద నెలవారి పూజలు అందుకున్న కనక ముత్యాలమ్మ అత్తవారైన ద్వారంపూడి సభ్యులు మేళతాళాలతో జాతర క్రతువు ముగిసింది.